సాక్షి అనంతపురం

గురువారం । 18 । మే । 2023



టన్ను చీనీ రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.40 వేలు పలికాయి.



సర్వాంగ సుందరం..

అనంతపురంలో పురావస్తు శాఖ పక్కా భవనం సర్వాంగ సుందరంగా నిర్మాణమవుతోంది.

8లో

గరిష్టం/కనిష్టం

43.5°/22.2°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో వేసవితాపం, ఉక్కపోత అధికమైంది. వడగాల్పుల తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజల్లో నమ్మకం పెరిగేలా పోలీసు సేవలు



అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

రాప్తాడు: పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలందిస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో అనంతపురం రూరల్ పోలీస్ సబ్ డివిజనల్ (డీఎస్పీ) కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. డీఎస్పీకి ఇటుకులపల్లి, అనంతపురం రూరల్ సీఐలు మోహన్, విజయ భాస్కర్ గౌడ్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అసాంఘిక శక్తుల ఆట కట్టించి.. శాంతిభద్రతలు పరిరక్షిస్తామన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దిశ యాప్‌పై అవగాహన కల్పించి మహిళలు, విద్యార్థినుల ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించడంపై దృష్టి సారిస్తామన్నారు. పోలీసులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా తమ సేవలుంటాయన్నారు. కార్యక్రమంలో రాప్తాడు, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, ఆత్మకూరు ఎస్‌ఐలు పి.వై.ఆంజనేయులు, రుషీంద్రబాబు, వెంకటేశ్వర్లు, సాగర్, జనార్దన్ పాల్గొన్నారు.

ఎస్‌ఏ పదోన్నతులకు సీనియార్టీ జాబితా సిద్ధం

రాప్తాడు రూరల్: అర్హులైన ఎస్జీటీలు తత్సమాన కేడర్ కల్గిన టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా (ఎస్‌ఏ) పదోన్నతులు కల్పించేందుకు సీనియార్టీ జాబితా సిద్ధం చేసినట్లు డీఈఓ సాయిరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాను డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 19వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. జాబితాలో పేర్లు ఉండి పదోన్నతులు తీసుకునేందుకు ఇష్టం లేని వారు 'అన్ విల్లింగ్' లెటర్ ఇవ్వాలన్నారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

రాప్తాడురూరల్: రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సాయిరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ సంస్థల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 11 నుంచి 28వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మాన్యువల్ అప్లికేషన్లు స్వీకరించబోమని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణ తేదీ తర్వాత ప్రకటిస్తారన్నారు.

జూన్ 1 నుంచి కార్డుదారులకు రాగులు



కందుకూరు గోదాములో నిల్వ చేసిన రాగులును పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: తెల్లకార్డుదారులకు జూన్ 1వ తేదీ నుంచి రాగులు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం ఆయన ఎస్‌డబ్ల్యూసీకి చెందిన కందుకూరు బఫర్ గోదామును సందర్శించి అక్కడ నిల్వ చేసిన రాగులు నాణ్యతను పరిశీలించారు. స్టాక్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 1 నుంచి బియ్యంతో పాటు రాగులు కార్డుకు కిలో చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ నీలమయ్య, గోదాము సిబ్బంది పాల్గొన్నారు.



అనంతపురంలో ఎండలోనే నడుస్తున్న తల్లీపిల్లలు



శ్రీకంఠం సర్కిల్ రోడ్డులో...



రామ్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై...



రిక్షాతొక్కుతూనే దాహం తీర్చుకుంటూ ముందుకు సాగుతున్న కార్మికుడు

నిప్పుల కుంపటి

భానుడు భగభగా మండుతున్నాడు. ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. పగలు 42 డిగ్రీలు దాటుతున్నాయి. బుధవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలు నమోదైంది. ఉదయం పది గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్రమైన వడగాడ్పులు వీస్తుండటంతో జనం అల్లాడిపోతున్నారు. తప్పనిసరై బయటకు రావాల్సి వస్తే గొడుగు పట్టుకునో.. తలకు టోపీ పెట్టుకునే, కర్చీఫ్ కట్టుకునో కనిపిస్తున్నారు. రోడ్డుపై వెళ్తుంటే వేడి సెగలు కక్కుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. - అనంతపురం అగ్రికల్చర్

సీట్లు లేవు..



- ఇంటర్ అడ్మిషన్లకు భారీగా వసూళ్లు
- రెసిడెన్షియల్ కాలేజీల్లో అయితే ఏడాదికి రూ.లక్షల్లో
- రకరకాల బ్యాచ్‌ల పేరుతో పిండుకుంటున్న కళాశాలలు
- పిల్లలను ఎక్కడ చేర్పించాలో తెలియక తల్లిదండ్రుల తికమక
- ఐఐటీ, నిట్‌లలో సీట్లు వస్తాయని విజయవాడకు పరుగో పరుగు
- ఏడాదికి రూ.రెండున్నర లక్షలకు పైగా వసూలు చేస్తున్న కార్పొరేట్ కాలేజీలు
- పదో తరగతిలో మంచి మార్కులు సాధించినా డబ్బులో పైసా తగ్గేది లేదు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: విద్యార్థుల తల్లిదండ్రులకు అతిపెద్ద సమస్య వచ్చిపడింది. తమ పిల్లలు పదవ తరగతిలో మంచి మార్కులు సాధించినందుకు సంతోషపడాలో.. ఇంటర్మీడియెట్ అడ్మిషన్ రూ.లక్షల్లో పలుకుతున్నందుకు బాధపడాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. ఏ కాలేజీలో చేర్పించాలో కూడా తేల్చుకోలేక సతమతమవుతున్న పరిస్థితి. కార్పొరేట్ కాలేజీలు విసిరే ఉచ్చు ఏదో ఒక రకంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తగులుతూనే ఉంది. తమ వద్ద చదివితే నిట్, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ వంటి వాటిల్లో సీట్లు వస్తాయని ఆశ చూపి అడ్మిషన్‌కు రూ.లక్షల్లో వసూలు చేస్తున్న తీరు మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు రేపుతోంది.

అడుగు పెట్టగానే 'సీట్లు లేవు'..

కార్పొరేట్ కాలేజీల వ్యూహంలో మొదటి భాగం 'సీట్లు లేవు' అనే పదం. అప్పటికి 10 శాతం సీట్లు కూడా భర్తీ అయ్యుండవు. అయినా 'సీట్లు లేవండీ, వారం రోజుల కిందటే అడ్మిషన్లు పూర్తయ్యాయి' అంటారు. దీంతో తల్లిదండ్రులు సీటుకోసం బతిమలాడటం మొదలుపెడతారు. ఈ బలహీనతను క్యాష్ చేసుకుని ఎలాగోలా సీటిస్తాం..అంటూ భారీగా రేటు చెబుతారు. దీంతో సీటొస్తే చాలు రేటు ఎంతయినాగానీ కట్టేందుకు సిద్ధపడుతున్నారు.

ఏడాదికి రూ.రెండున్నర లక్షలా?

విజయవాడ కేంద్రంగా జరిగే ఇంటర్మీడియట్ కార్పొరేట్ వ్యాపారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు పాకింది. పలు ఇంటర్ రెసిడెన్షియల్ కాలేజీలు తమ ఏజెంట్ల ద్వారా ఇక్కడ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ముగ్గులో దించుతున్నారు. కాలేజీలో రకరకాల గ్రూపుల పేరుతో గరిష్ఠంగా ఏడాదికి రూ.2.50 లక్షలు వసూలు చేస్తున్నారు. ఈ రేటు వినగానే తల్లిదండ్రులకు మూర్ఛ వచ్చినంత పనవుతోంది. రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సుకే ఖర్చులతో కలిపి రూ.6 లక్షలు వ్యయం చేయాల్సి వస్తోంది. జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు తెప్పిస్తామన్న కాలేజీల ప్రకటనలు నమ్మి తల్లిదండ్రులు విజయవాడకు పరుగులు తీస్తున్నారు.

2023లో ఎస్‌ఎస్‌సీలో ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలు

అనంతపురం జిల్లాలో..	
హాజరైన బాలురు	15,307
ఉత్తీర్ణులైన బాలురు	9,594
హాజరైన బాలికలు	14,359
ఉత్తీర్ణులైన బాలికలు	10,060
మొత్తం హాజరైన వారు	29,666
మొత్తం ఉత్తీర్ణులైన వారు	19,654

శ్రీసత్యసాయి జిల్లాలో..	
హాజరైన బాలురు	11,566
ఉత్తీర్ణులైన బాలురు	6,740
హాజరైన బాలికలు	10,677
ఉత్తీర్ణులైన బాలికలు	7,009
మొత్తం హాజరైన వారు	22,243
మొత్తం ఉత్తీర్ణులైన వారు	13,749

బలహీనతను సొమ్ము చేసుకోవడమే..



మనపిల్లవాడు బాగా చదివే వాడైతే.. కార్పొరేట్ కాలేజీ సొమ్ము చేసుకుంటోంది తప్ప.. కాలేజీ బాగా చదువు చెప్పి మన పిల్లాడికి ఉపయోగపడడం లేదు. ఇది తల్లిదండ్రులు గ్రహించాలి. మనం అక్కడ చేర్పించాక బాగా చదివే పదిమందో, వందమందిపైన మాత్రమే కాలేజీ ఏకాగ్రత చూపిస్తుంది. మనం లక్షలు వెచ్చించినా మనపైన ఏకాగ్రత ఉండదు. కాబట్టి మనపిల్లాడు చదివేవాడైతే కార్పొరేట్ కాలేజీ అయినా ప్రభుత్వ కాలేజీ అయినా ఒకటే. పిల్లల పట్ల తల్లిదండ్రులకు ఉన్న బలహీనతను వాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. –డా.ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు

ఇష్టానుసారంగా వసూలు చేస్తే చర్యలు



ఇంటర్ ప్రవేశాలకు కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు. రకరకాల కోర్సుల పేరుతో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకోవాలి. అంతేకానీ ఇబ్బడిముబ్బడిగా ఫీజులు వసూళ్లు చేస్తే మాత్రం ఉపేక్షించేదే లేదు. – సురేష్‌బాబు, ఆర్‌ఐఓ

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- ఈ నెల 22 నుంచి 31 వరకు అవకాశం

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తూ మార్గదర్శకాలతో కూడిన జీఓ 71ను బుధవారం జారీ చేసింది. ఈ నెల 22 నుంచి 31లోపు మార్గదర్శకాలను అనుసరించి ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది. విద్యాశాఖ మినహా ఇతర అన్ని శాఖలూ బదిలీలు చేపట్టవచ్చు. బదిలీలు పూర్తిగా ఉద్యోగుల అభ్యర్థన మేరకు ఉంటాయి.

మార్గదర్శకాలిలా...

ఒకే స్థానంలో రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు. ఒకే స్థానంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీపై వెళ్లాల్సి ఉంటుంది. బదిలీల్లో ప్రాధాన్యత ఎవరికి ఇవ్వాలనేదానిపైనా స్పష్టత ఇచ్చారు. 40 శాతం అంతకు మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు, బుద్ధిమాంద్య సంతానం ఉన్నవారు, ఉద్యోగిపై ఆధారపడిన వారు ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్న (కేన్సర్, గుండె చికిత్స, న్యూరో సర్జరీ, కిడ్నీల మార్పు) వారు ఉంటే, కారుణ్య నియామకం పొందిన వితంతువులకు, స్పౌజ్ కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అందుబాటులో హాల్‌టికెట్లు

రాప్తాడురూరల్: ఏపీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 20న నిర్వహించనున్న పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచినట్లు ఏపీఆర్ఎస్, జేసీ సెట్ జిల్లా కోఆర్డినేటర్, గుత్తి పాఠశాల ప్రిన్సిపాల్ బీఈ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 5, 6, 7, 8 తరగతుల ప్రవేశాలకు ఉదయం 10 గంటలకు, ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాల్‌టికెట్‌తో పాటు బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ప్యాడ్ తీసుకుని రావాలన్నారు.

ప్రజలకు చేరువగా రెవెన్యూ సేవలు



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు, ఎంపీ రంగయ్య, కలెక్టర్ గౌతమి

డి హీరేహాళ్ (రాయదుర్గం): జగనన్న పాలనలో రెవెన్యూ సేవలు ప్రజలకు చేరువయ్యాయని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. డీ హీరేహాళ్ మండల కేంద్రంలో రూ.90 లక్షల వ్యయంతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమితో కలిసి విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్, ఎంపీ మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. బ్రిటీష్ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న భూములకు 'జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష' పథకం ద్వారా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లక్షలాది కుటుంబాలకు ఊరట కలిగేలా చుక్కల భూములకు పరిష్కారం చూపించారన్నారు. టీడీపీ హయాంలో ప్రతి పనికీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు.

నిర్వాసితులకు పరిహారం అందించండి

బళ్లారి–బెంగళూరు (ఎన్‌హెచ్–150) ఫోర్ లేన్ రహదారి నిర్మాణం కోసం డీ హీరేహాళ్ మండల కేంద్రంలో భూములు, భవనాలు కోల్పోయిన వారికి పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కలెక్టర్ గౌతమికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎల్‌డీఓ శంకర్, పీఆర్ డీఈ రామమోహన్‌రెడ్డి, తహసీల్దార్ బసవకుమార్, ఎంపీడీఓ భాస్కర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ డీఈలు స్టాలిన్, శైలజ, ఎంపీపీ పవిత్ర, జెడ్పీటీసీ సభ్యురాలు హసీనాబాను, సర్పంచ్ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమవ్వాలి

రాయదుర్గం: పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేర్చేలా అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ గౌతమి సూచించారు. బుధవారం రాయదుర్గంలోని టీటీపీ, ఎంసీఏ లేఅవుట్లను ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, హౌసింగ్, పీఆర్ డీఈలు శైలజ, రామమోహన్‌రెడ్డిలతో కలసి కలెక్టర్ పరిశీలించారు. టీటీపీ లేఔట్‌లో హౌసింగ్, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఏర్పాటైన 14 జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతి పై ఆరా తీశారు. కాలనీల్లో వంద శాతం నిర్మాణాల పూర్తికి చొరవ చూపాలన్నారు. అక్రమ లే అవుట్లను గుర్తించి, రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిపివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు కలెక్టర్ సమాధానమిచ్చారు. అంతకు ముందు డీ హీరేహాళ్ మండలంలో కలెక్టర్ పర్యటించారు. నాడు- నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులను, డీహీరేహాళ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, సోమలాపురం సచివాలయాన్ని తనిఖీ చేశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో యుక్తవయసు కలిగిన అమ్మాయిల వివరాలు సేకరించాలని, వారికి బాల్య వివాహాలు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయా అనే దానిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఒక్క బాల్య వివాహం జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

భూముల పరిశీలన..

డీ హీరేహాళ్ మండలం జాజరకల్లు వద్ద మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఇంధనం తయారు చేసే ప్లాంట్ ఏర్పాటుకు ఎకోస్టీల్ కంపెనీ దరఖాస్తు చేయడంతో కలెక్టర్ గౌతమి, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి బుధవారం భూములను పరిశీలించారు.

మొక్కజొన్న కొనుగోళ్లపై అవగాహన కల్పించండి

యాడికి: కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న అమ్ముకునేలా రైతులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులకు సూచించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 103 మంది రైతుల నుంచి 756 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను క్వింటా రూ.1,962 చొప్పున వేములపాడు వద్ద మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఈ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అలెగ్జాండర్, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలి

గుత్తి : రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. గుత్తిలోని పవన్ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విత్తన ప్రాసెసింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లను వ్యవసాయాధికారులు తరచూ తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, మండల వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఆర్‌ఐ సందీప్, వీఆర్వోలు పవిత్ర, రంగయ్య, పవన్ ఏజెన్సీ నిర్వాహకులు బయపరెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం

- అక్రమార్కులను ప్రోత్సహిస్తున్న అధికారులు
- జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాల్లో సభ్యుల ధ్వజం

అనంతపురం సిటీ: హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి వెంబడి దాబాలు, అపార్ట్‌మెంట్లు అక్రమంగా వెలుస్తున్నాయని జిల్లాపరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు భారీ మొత్తంలో మామూళ్లు తీసుకుని అక్రమార్కులను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ప్రభాకర్‌రావును జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో పాటు సభ్యులు మంజునాథ(శెట్టూరు), భాస్కర్(బుక్కరాయసముద్రం) డిమాండ్ చేశారు. జిల్లాపరిషత్ స్థాయీ సంఘం–2, 4 (గ్రామీణాభివృద్ధి/ విద్య/ వైద్య శాఖలు) సమావేశాలు చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి చర్చను ప్రారంభించారు. జాతీయ రహదారి వెంబడి రూ.కోట్లు విలువ చేసే భారీ భవంతులు, రెస్టారెంట్లు, దాబాలు అక్రమంగా నిర్మించే వారి భరతం పట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగం మరచి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగితేలుతున్నారని, అటువంటి వారిని సస్పెండ్ చేయాల్సిందేనని సభ్యులు పట్టుబట్టారు.

బోధన ప్రమాణాలు మెరుగుపరచండి

విద్యా శాఖపై చర్చ ప్రారంభించిన వెంటనే అనంతపురం డీఈఓ సాయిరాం మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం జరిగిన పదో తరగతిలో మంచి ప్రగతి సాధించామని చెప్పు కురాగా.. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అభ్యంతరం తెలిపారు. ఆశించిన స్థాయిలో పదో తరగతి ఫలితాలు రాలేదన్నారు. బోధనా ప్రమాణాలు మెరుగుపరచి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. వైద్య శాఖపైనా చర్చ సాగింది.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

- జెడ్పీలోని అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం -5, 6 (స్త్రీ, శిశు సంక్షేమం/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ఐసీడీఎస్ సమావేశానికి బెళుగుప్ప జెడ్పీటీసీ సభ్యురాలు మమత అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ శ్రీసత్యసాయి జిల్లా పీడీ లక్ష్మీకుమారి, అనంతపురం పీడీ కార్యాలయం నుంచి నోడల్ ఆఫీసర్ వనజాక్షి, ఈఓ భారతి, సఖి సెంటర్ మేనేజర్ శాంతామణి హాజరయ్యారు.
- సాంఘిక సంక్షేమ శాఖల సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ అధ్యక్షత వహించారు. సాంఘిక సంక్షేమ శాఖల్లో జరిగే ప్రతి అంశం తనకు తెలియాల్సిందేనని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ అధికారులు ఖుష్బూ కొఠారి, మస్తాన్, అన్నాదొర హాజరయ్యారు.

క్లుప్తంగా

యువతి ఆత్మహత్య


మృతురాలు కావేరి

గుంతకల్లు రూరల్: జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన అంజనేయులు కుమార్తె కావేరి (21)కి కొంత కాలం క్రితం గుండె సంబంధిత శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో కొంత కాలం క్రితం గుంతకల్లులోని మిల్లు కాలనీలో ఉంటున్న తన చిన్నాన్న బసప్ప ఇంటికి వచ్చిన ఆమె... బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆవును చంపిన చిరుత



బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఆవును ఓ చిరుత చంపి, సగానికి పైగా తినేసింది. గ్రామానికి చెందిన రైతు కాపు బసిరెడ్డి మంగళవారం రాత్రి తన తోటలో పశువుల మందను వదిలి ఇంటికెళ్లి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత మందలోకి చొరబడిన చిరుత.. ఓ ఆవును చంపి తినేసింది. బుధవారం ఉదయం తోటకెళ్లిన రైతు ఈ విషయాన్ని గుర్తించి, సమాచారం అందించడంతో అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

పురావస్తు భవనం.. సర్వాంగ సుందరం

సందర్భం నేడు జాతీయ మ్యూజియం డే

- రూ. 7.5 కోట్లతో నిర్మాణమవుతున్న అద్భుత కట్టడం


సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న పురావస్తు శాఖ మ్యూజియం


మ్యూజియం డే వేడుకలకు ముస్తాబైన అనంతపురంలోని పీస్ మెమోరియల్ హాల్

అనంతపురం కల్చరల్: ఆదిమానవుడు ఉపయోగించిన రాతి పనిముట్లు, మట్టిబొమ్మలు, బౌద్ధ, జైనుల ప్రాశస్త్యం తెలిపే రాతి, కాంస్య ప్రతిమలు, వివిధ రాజవంశాలకు చెందిన అరుదైన సామగ్రితో కూడిన 'అనంత' చరిత్రను మరింత ఘనంగా ఆవిష్కరించేలా జిల్లా కేంద్రంలో సర్వాంగ సుందర కట్టడం ఏర్పాటవుతోంది. పురాతన వస్తువులకు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ రాష్ట్రంలోనే అందమైన కట్టడాల్లో ఒకటిగా మ్యూజియం నిర్మాణమవుతోంది. చరిత్రకు దర్పణంగా నిలిచే అధునాతన భవంతి జిల్లా వాసులకు మరో నెలరోజుల్లో అందుబాటులో రానుంది. చరిత్ర ప్రాధాన్యతను వివరించే క్రమంలో ఏటా మే 18న 'మ్యూజియం డే' నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో అధునాతన సౌకర్యాలతో నిర్మాణమవుతున్న పురావస్తు శాఖ భవంతి విశేషాలు మీ కోసం.

అనంత మ్యూజియం ప్రత్యేకతలివే

జిల్లా కేంద్రంలోని ఆదిమూర్తి నగర్‌లో రూ.7.5 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అత్యంత రమణీయ కట్టడాన్ని పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. జిల్లా సంస్కృతి, వారసత్వ సంపద, చరిత్ర ప్రతిబింబించేలా కల్లూరు సుబ్బారావు మ్యూజియం పేరిట ఈ భవంతి రూపుదిద్దుకుంటోంది. ఇక్కడ నూతనంగా ఇంటరాక్టివ్ డిస్‌ప్లే, టచ్ స్క్రీన్ ద్వారా జిల్లాలోని ప్రసిద్ధ క్షేత్రాల విశేషాలు, చరిత్రాత్మక స్థలాలు, జైన, బౌద్ధ అవశేషాలను ప్రత్యక్షంగా చూసే ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జిల్లా చరిత్రకు సంబంధించి దాదాపు వెయ్యికి పైగా వస్తువులు ఇందులో భద్రపరచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వేల ఏళ్ల నాటి పనిముట్లు, మట్టి బొమ్మలు, అజంతా, చుగ్‌తాయ్, డెక్కన్, రాజస్తానీల ఆధునిక చిత్రలేఖనాలు, బంగారు, వెండి నాణేలు, కవచాలు, పిస్టళ్లు, కత్తులు, డాళ్లు, ఫిరంగులు ప్రదర్శనకు ఉంచనున్నారు. అంతేకాక ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా జిల్లా చరిత్రను కళ్లముందే చూసుకునే వెసులుబాటూ కల్పిస్తున్నారు. ఈ మ్యూజియం జూన్ ఆఖరులోపు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మ్యూజియం డే వేడుకల్లో పాల్గొనండి

జిల్లా కేంద్రంలోని కోర్టు రోడ్డులో ఉన్న పీస్ మెమోరియల్ హాల్‌లో గురువారం ఉదయం మ్యూజియం డే వేడుకలు నిర్వహించనున్నాం. టూరిజం శాఖ, ఇంటాక్ వారి సహకారంతో సాగే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి.

– రజిత, సహాయ సంచాలకులు, జిల్లా పురావస్తుశాఖ

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలంలోని కల్యం వద్ద మంగళవారం అర్ధరాత్రి వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడుయాదవ్ బుధవారం తెలిపారు. సుమారు 32 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి, మతిస్థిమితం లేకుండా చుట్టుపక్కల గ్రామాల్లో సంచరించేవాడని గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మున్సిపల్ కార్మికుల సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జూడో క్రీడాకారుల ఎంపిక నేడు

కళ్యాణదుర్గం: జాతీయ స్థాయి అండర్ –19 జూడో చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 18, 19 తేదీల్లో స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో చేపట్టనున్నారు. ఈ మేరకు జూడో అసోసియేషన్ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ, సీఈఓ బాబు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 6 నుంచి 12వ తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

కొలువుకు ఇం'టర్న్' షిప్

- డిగ్రీ మూడో సంవత్సరం 5, 6 సెమిస్టర్లలో తప్పనిసరిగా అప్రెంటిషిప్, ఇంటర్న్‌షిప్
- ఆరు నెలల కాల వ్యవధితో కూడిన ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ శిక్షణ అనివార్యం
- ప్రారంభమైన ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ నివేదికల మూల్యాంకనం
- ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్‌కు 200 మార్కుల కేటాయింపు


తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైవా ప్రక్రియకు హాజరైన విద్యార్థి

అనంతపురం: ఇంటర్మీడియట్ తర్వాత డిగ్రీ చదవడం సాధారణం. అయితే, డిగ్రీ సర్టిఫికెట్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదు. ఏ కంపెనీ ఇంటర్వ్యూకు వెళ్లినా నైపుణ్యతపై ఆరా తీస్తుండడంతో ఆ దిశగా నైపుణ్యాల మెరుగుకు డిగ్రీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌నకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా 2020–21 విద్యా సంవత్సరం నుంచే పూర్తి స్థాయిలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని అమలు చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇప్పటికే బీఏ, బీకాం, బీబీఎం కోర్సులు చదివే విద్యార్థులకు ఇంటర్న్ షిప్ పూర్తయింది. వీరికి ఈ నెల 17వ తేదీ నుంచి ఇంటర్న్‌షిప్ ఎవాల్యుయేషన్‌కు సంబంధించిన వైవాలు ప్రారంభమయ్యాయి. మొత్తం 200 మార్కులకు వైవా ఉంటుంది. ఇందులో ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పణకు 50, ఎక్స్‌టర్నల్స్‌కు 150 మార్కులు కేటాయించారు. వైవాను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలనే ఎంపిక చేశారు. బీఏ, బీకాం, బీబీఎం, బీబీఏ కోర్సుకు చెందిన 7,447 మంది విద్యార్థులు వైవాకు హాజరుకానున్నారు. 2020–21 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి బ్యాచ్ విద్యార్థులు కావడంతో వైవా అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, టీచర్ గైడ్(మెంటార్), ఇంటర్నల్ ఎగ్జామినర్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్(వర్సిటీ చేత నామినేట్ చేయబడిన వ్యక్తి)ల పర్యవేక్షణలో వైవా కమిటీని నియమించారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే సంబంధిత కమిటీల పరిశీలన అనంతరం జ్ఞానభూమి పోర్టల్‌లో వివరాలు నమోదు చేయనున్నారు.

కట్టుదిట్టంగా నిర్వహిస్తాం



ఈ నెల 17 నుంచి బీఏ, బీకాం, బీబీఎం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ ఎవాల్యుయేషన్ నిర్వహిస్తున్నాం. కేవలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే ఎవాల్యుయేషన్ ప్రక్రియ నిర్వహించాలని నిర్దేశించాం. మార్కులు కేటాయింపు పరిశీలనకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశాం.

–ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

ఆ రెండు ఆస్పత్రులు సీజ్



'రూత్' ఆస్పత్రి వద్ద డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, బాలాజీ నర్సింగ్ హోంను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

- అనుమతుల్లేకుండా రూత్ ఆస్పత్రి నిర్వహణ
- గర్భిణి మృతితో అజ్ఞాతంలోకి డాక్టర్ లక్ష్మీకాంతమ్మ
- అనుమతుల్లేకున్నా.. ఆస్పత్రి నిర్వహణ
- రెన్యూవల్ చేయించుకోని బాలాజీ నర్సింగ్ హోం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం క్రైం: గర్భిణుల మృతికి కారణమైన అనంతపురంలోని రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, శ్రీబాలాజీ నర్సింగ్ హోంలను డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్ బుధవారం సీజ్ చేశారు. ఈ నెల 15న ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత(25), నగరంలోని ఆర్వేటి నగర్‌కు చెందిన సనం సుల్తానా(28)తో పాటు గర్భస్థ శిశువూ మృతి చెందిన విషయం విదితమే. దీనిపై ఈ నెల 16న 'అనంతలో దారుణం', ఈ నెల 17న 'చిదిమేస్తున్నారు' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ గౌతమి తక్షణమే విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డెమో బృందం ఆయా ఆస్పత్రులను సీజ్ చేశారు. డెమో భారతి, ఆరోగ్యశాఖ సిబ్బంది త్యాగరాజు, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, లీగల్ కన్సల్టెంట్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

పత్తాలేని డాక్టర్ లక్ష్మీకాంతమ్మ

బుధవారం సాయంత్రం తొలుత శ్రీనివాస్‌నగర్‌లోని రూత్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యాధికారులు వెళ్లారు. ఆస్పత్రికి తాళం వేసి ఉండడంతో ఆస్పత్రి వైద్యురాలు, వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు డీఎంహెచ్ఓ ఫోన్ చేశారు. తాను ఊళ్లో లేనని ఆమె సమాధానమిచ్చారు. చుట్టుపక్కల వారు వైద్యాధికారులతో మాట్లాడుతూ.. రోజూ కర్ణాటక, జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు వస్తుంటారని, ఈ పరిస్థితి జాతరను తలపిస్తూ ఉంటుందని వివరించారు. 20 పడకలతో ఆస్పత్రి నిర్వహణకు అనుమతులు కోరుతూ ఈ ఏడాది ఏప్రిల్ 11న నిర్వాహకులు ఆరోగ్యశాఖకు దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు లోపాలను గుర్తించి ఆ దరఖాస్తును తిరస్కరించారు. అయినా రూత్ ఆస్పత్రిని రెండో రోడ్డు ఎక్స్‌టెన్షన్, తపోవనం వద్ద నిర్వహిస్తున్నట్లు దరఖాస్తులో చూపి శ్రీనివాసనగర్‌లో కొనసాగిస్తున్నట్లుగా గుర్తించారు.దీంతో ఆస్పత్రిలోని మూడు గదులకు నోటీసులు అతికించి సీజ్ చేశారు. కాగా, ఇప్పటికే డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై కుప్పలుతిప్పలుగా ఫిర్యాదులున్నాయని, ఈ నేపథ్యంలో ఆమె డిగ్రీని రద్దు చేసేందుకు అధికారికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

అనంతరం బాలాజీ నర్సింగ్ హోంకు వెళ్లిన వైద్యాధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. 50 పడకల నిర్వహణకు ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీతో అనుమతులు పూర్తికాగా, అప్పటి నుంచి రెన్యూవల్ చేసుకోలేదని గుర్తించారు. అంతేకాక ఫైర్ ఎన్‌ఓసీ లేకపోవడం, పీజీ వైద్యురాలి డిగ్రీ రెన్యూవల్ కాకపోవడం, ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండగా ఆరుగురి పేర్లను డిస్‌ప్లేలో ఉంచడం తదితర అంశాలను గుర్తించి, ఆస్పత్రిని సీజ్ చేశారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తాం

- ఎస్పీ కె.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గుంతకల్లు రూరల్: ఫ్యాక్షన్‌కు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం అలవర్చుకుంటే గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని గుంతకల్లు మండలం కొంగనపల్లి వాసులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు భరోసానిచ్చారు. డీఎస్పీ నర్శింగప్ప, రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్‌ఐ గోపాలుడితో కలసి ఫ్యాక్షన్ ప్రభావితమైన కొంగనపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, దీంతో పిల్లల చదువుకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోయారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు. వర్గకక్షలు వీడి ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని, గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌తో సంప్రందించి బస్సు ఏర్పాటు చేయిస్తామని భరోసానిచ్చారు. పిల్లలను బాగా చదివించి వారిని ప్రయోజకులను చేయాలని సూచించారు. సమస్యలపై ఒకరికొకరు గొడవలకు పోకుండా పోలీసుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ కలసిమెలసి ఉండాలన్నారు. పరస్పర సహకారం ఉన్నప్పుడే వ్యవసాయం పండుగలా సాగుతుందన్నారు.

సాయంత్రం ఓపీ ప్రారంభం


సర్జికల్ ఓపీలో రోగులను చూస్తున్న సర్జన్ మృదుల

అనంతపురం క్రైం: నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఓపీ సమయాన్ని పెంచుతూ డీఎంఈ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్ని విభాగాల ఓపీల్లో రోగులకు సేవలందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆదేశాలతో ఆర్ఎంఓ డాక్టర్ వైపీ రావు బుధవారం సాయంత్రం ఆస్పత్రిలో ఓపీ మొదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. సర్జికల్, ఆప్తమాలజీ ఓపీల్లో సేవలను ఆయన పరిశీలించారు. ఉదయం వచ్చిన రోగులు పరీక్షలు చేయించుకున్న అనంతరం వాటి నివేదికలు వస్తే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ చూసి వైద్యం అందించాలన్నారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ ప్రసాద్, సర్జన్ డాక్టర్ మృదుల, పీజీ వైద్యుడు డాక్టర్ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీతో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి భేటీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఉరవకొండలో శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్ స్థానంలో నూతన కట్టడం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే అన్ని అనుమతులు మంజూరయ్యాయని, పరిపాలన అనుమతులు రాగానే నిర్మాణానికి టెండర్లు పిలుస్తారని ఎస్పీకి వివరించారు. ఈ క్రమంలో అధునాతన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని కోరారు.

విజ్ఞాన శిబిరాలతో మేధో వికాసం


పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో మేధో వికాసం పెంపొందుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి విభాగం ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్‌రెడ్డి, డాక్టర్ మార్కరెడ్డి, నాగార్జునరెడ్డి మాతృమూర్తి కృష్ణమ్మ, సంస్థ కార్యదర్శి పి.రమ తదితరులు పాల్గొన్నారు.

గాలిమరల సబ్ స్టేషన్ ముట్టడి


గాలిమరల కంపెనీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

కూడేరు: మండలంలోని మరుట్ల, కలగళ్ల, బోళసముద్రం, కొర్రకోడు గ్రామాల రైతులు బుధవారం ఇప్పేరులోని గ్రీన్‌కో కంపెనీకి చెందిన గాలిమరల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. వీరికి వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులు నాయుడు, పెన్నోబులేసు మద్దతు తెలిపారు. గాలి మరల వద్దకు వాహనాలు వెళ్లేందుకు అవసరమైన రహదారి కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి లీజు సమయం గడిచి మూడు నెలలైనా డబ్బు చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించారు. లీజు డబ్బు చెల్లిస్తే భూముల్లో వాహనాల రాకపోకలను కొనసాగిస్తామని, లేకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు. స్పందించిన సంబంధిత అధికారులు మాట్లాడుతూ... ఈ నెలాఖరుకు అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీనివ్వడంతో రైతులు వెనుదిరిగారు. కార్యక్రమంలో రైతులు గోపాల్, రామకృష్ణ, ఛత్రేనాయక్, అల్లాబకాష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధించుకుందాం

అనంతపురం అర్బన్: ఉద్యమాలు ఎప్పటికీ వృథా కావని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వంతో పోరాడి హక్కులు సాధించుకుందామని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కృష్ణకళా మందిర్‌లో ఏపీ జేఏసీ అమరావతి సంఘం ప్రాంతీయ సదస్సు నిర్వహించింది. జిల్లా చైర్మన్ దివాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన బొప్పరాజు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సదస్సులో ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ముగిసిన ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, రెవెన్యూ అధికారులు

అనంతపురం రూరల్: కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న 3 అంగన్‌వాడీ కార్యకర్త, 25 ఆయా పోస్టుల భర్తీకి బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలు సజావుగా ముగిశాయి. కార్యకర్త పోస్టులకు 17 మంది దరఖాస్తు చేసుకోగా 14 మంది హాజరయ్యారు. ఆయా పోస్టులకు 41 మంది దరఖాస్తు చేసుకోగా 32 మంది హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అనంతపురం ఆర్డీఓ మధుసూదన్, గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల విద్యార్హత పత్రాలను పరిశీలించారు.

క్లుప్తంగా

'వేరుశనగ'కు పేర్లు నమోదు చేసుకోండి



పంపనూరులో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం అందజేసే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఈఓ సుజిత తెలియజేశారు. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, సెల్ నంబర్‌తో వేలి ముద్ర వేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పలు గ్రామాలకు వేరుశనగ కాయలు రావడంతో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వాటిని పరిశీలించారు.

ప్రతి విద్యార్థికీ విద్యా కానుక



కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందచేసే జగనన్న విద్యా కానుక కిట్లు అందాలని మండల జగనన్న విద్యా కానుక మండల ప్రత్యేక అధికారి అప్పాజీ, ఎంఈఓ నరసింహారెడ్డికి, ఉపాధ్యాయులకు తెలియచేశారు. బుధవారం స్థానిక నార్త్ మండల పాఠశాలలో స్టాక్ పాయింట్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించారు.

అర్హులందరికీ వేరుశనగ



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామాంజినేయులు

రాప్తాడు: అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ కాయలు అందించాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వేరుశనగ విత్తన పంపిణీపై వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో దండోరా వేయించి విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం 3200 క్వింటాళ్లు అవసరమని అధికారులు నివేదికలు తయారు చేశారని, రైతులు వేరుశనగ విత్తన కాయలు కావాలని అడిగితే 10 వేల క్వింటాళ్లు కూడా తెప్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో అగ్రి బోర్డు చైర్మన్ కేశవరెడ్డి, ఏఓ శుభకర్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కనగానపల్లి: తల్లిమడుగుల సమీపంలో బుధవారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వెంకటరమణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. అతని వద్ద నుంచి 25 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రిజిష్టర్ పత్రాలు అందించండి

అనంతపురం రూరల్: పుట్లూరు మండలం అరకటవేములలో దళిత రైతులకు ఇచ్చిన భూములకు రిజిష్టర్ పత్రాలను అందజేయాలని సీపీఐ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగభూషణంను కోరారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం ఇచ్చారు.

ముగిసిన పారాయణం



పారాయణం చేయిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: తపోవనంలోని శివశక్తిసాయి దేవాలయంలో నాలుగు రోజులుగా సాగుతున్న సామూహిక సుందర కాండ పారాయణం బుధవారం సాయంత్రం ముగిసింది. వేదపండితులు వేద్రాది ప్రవీణ్‌కుమార్ భక్త బృందాలతో పారాయణం చేయించారు. హనమ నామస్మరణతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో నిర్వాహకులు విజయ్‌కుమార్, దేవాలయ కమిటీ సభ్యులు దేవేంద్ర, నాగరాజు, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కురుబ యువజన సంఘం అధ్యక్షుడిగా బిల్లే ముత్యాలు

కనగానపల్లి: రాప్తాడు నియోజక వర్గ కురుబ యుజన సంఘం అధ్యక్షుడిగా మండలంలోని తల్లిమడుగులకు చెందిన బిల్లే ముత్యాలును నియమించారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు పామాల రాజశేఖర్ నుంచి నియమక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నారుల నైపుణ్యం అభినందనీయం

- ముగిసిన 'సాక్షి' వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



మాస్టర్ కత్తి విజయ్‌కుమార్‌ను సన్మానించిన దృశ్యం

అనంతపురం కల్చరల్: తక్కువ సమయంలోనే చిన్నారులు నైపుణ్యం ప్రదర్శించడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో రెండురోజుల వేసవి శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. కృష్ణ కళామందిరంలో జరిగిన ముగింపు సమావేశానికి సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి కోగటం విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ వార్తల వరకే పరిమితం కాకుండా సమాజంలో అనేక విషయాల పట్ల అవగాహన, చైతన్యం కల్గిస్తున్న 'సాక్షి' సామాజిక బాధ్యత ప్రశంసనీయమన్నారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వేసవి శిక్షణా శిబిరం ద్వారా వెలికితీయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆత్మీయ అతిథులు సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు లహరి తదితరులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా విద్యార్థుల్లోని టాలెంట్స్‌ను వెలికితీస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న ప్రముఖ డ్యాన్స్, ఆర్ట్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ జిల్లాకే గర్వకారణమన్నారు. అనంతరం కోగటం విజయభాస్కరరెడ్డి, కత్తి విజయ్‌కుమార్‌లను సంస్కార భారతి నిర్వాహకులతో కలిసి చిన్నారులు సత్కరించారు.

ఆనందోత్సాహాల నడుమ..

వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో చిన్నారులు సందడి చేశారు. చిత్రలేఖనం, కరాటే అంశాల్లో పోటీ పడి ప్రతిభ కనబరిచారు. అలాగే ఫోక్, వెస్ట్రన్ డ్యాన్సులతో అదరగొట్టారు. అన్ని అంశాల పట్ల అవగాహన, మెలకువలు నేర్చుకున్న చిన్నారులకు త్వరలో ప్రశంసాపత్రాలనందిస్తామని కత్తి విజయ్‌కుమార్ తెలిపారు. ముగింపు వేడుకల్లో కవి రియాజుద్దీన్, కళాసాగర్ సంస్థ మేనేజర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చార్జ్‌షీట్



అలమూరు లే అవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: అక్రమ నిర్మాణాలపై చార్జ్‌షీట్ దాఖలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. ఏసీపీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితర సిబ్బంది పనితీరు పట్ల కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చెప్పినా మార్పు కన్పించడం లేదన్నారు. నెలాఖరులోపు బీపీఎస్‌కు చివరి అవకాశం అని, పెండింగ్‌లో ఉన్న బీపీఎస్, ఎల్ఆర్ఎస్ ఫైళ్లను పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారు షార్ట్‌ఫాల్స్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టేలా నిర్మాణదారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తూతూమంత్రంగా నోటీసులు జారీ చేసి, చేష్టలుడిగి చూస్తే సరిపోదన్నారు. సమావేశంలో ఏసీపీ సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పెంచాలి

జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కార్మికుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను కమిషనర్ ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఆలమూరు లే అవుట్‌ను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు.

మదరసాను మూసివేసే ప్రసక్తే లేదు



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ రిజ్వాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, ఈఓ హుస్సేన్‌సాబ్

అనంతపురం సిటీ: నగరంలోని డ్రైవర్స్ కాలనీలో గల నూరానీ మస్జీద్‌కు సంబంధించిన మదరసాను మూసివేసే ప్రసక్తే లేదని మేయర్ మహమ్మద్ వసీం సలీం స్పష్టం చేశారు. మదరసాను మూసివేస్తున్నారంటూ టీడీపీ నాయకులు ధర్నాలు చేసి, దుష్ప్రచారం చేయడం దారుణమని ఖండించారు. బుధవారం వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, జామియా మస్జిద్ ఈఓ హుస్సేన్‌సాబ్ తదితరులతో కలిసి మేయర్ విలేకరులతో మాట్లాడారు. మదరసాలో పిల్లల సంఖ్య ఎలా పెంచుకోవాలనే అంశంపై కసరత్తు చేస్తుంటే, టీడీపీ నేతలు ఏకంగా మదరసాను మూసివేస్తున్నారంటూ ముస్లింలలో ఆందోళన రేకెత్తించే చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు. మసీదులు గానీ, మదరసాలు గానీ మూసివేసిన సందర్భాలు చరిత్రలో ఎక్కడా, ఎప్పుడు లేవనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, మదరసాను మరింత అభివృద్ధి చేసి, ముస్లిం పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించేలా చొరవ తీసుకుంటామని నేతలు ప్రకటించారు. తాను సేవాభావంతో రెమ్యునరేషన్ తీసుకోకుండా పని చేసేందుకు వస్తే.. తనపై బురద జల్లే చర్యలకు టీడీపీ నేతలు దిగడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఈఓ హుస్సేన్ సాబ్ అన్నారు. పిల్లల సంఖ్య తక్కువగా ఉండగా, ఖర్చు తడిసిమోపెడవుతోందని, అయితే మసీదు గదులకు చెల్లించాల్సిన బాడుగలు 16 నెలలుగా చెల్లించకపోతే మదరసా ఏ విధంగా నిర్వహించాలని ఆయన ప్రశ్నించారు. జామియా మస్జిద్ కమిటీ సభ్యులు రియాజ్, ఫిరోజ్, తబ్రేజ్, ముహేబ్, నూర్, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: ప్రజాస్వామ్యానికి లోబడి ప్రజాప్రతినిధులతో కలసి ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాఖల వారీగా అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

అధికారులపై ఆగ్రహం

అర్అండ్‌బీ, అటవీశాఖ అధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పలుచోట్ల రహదారుల పక్కన ఉన్న ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా ఆ శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల పలు గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని ఆర్అండ్‌బీ జేఈ సింధూర దృష్టికి తీసుకెళ్లారు. అటవీశాఖ అధికారిణి గౌతమి స్థానిక ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా తన ఇష్టానుసారం పనిచేస్తున్నారని వైస్ ఎంపీపీ నరసింహారెడ్డితో పాటు దాదులూరు, కుర్లపల్లి సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుర్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలోని చెట్లకు నిప్పు పెట్టి నాశనం చేస్తున్నా పట్టించుకోకపోవటంతో పాటు కలప అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన మండల గ్రాంట్ నిధుల వినియోగంపై తగరకుంట ఎంపీటీసీ క్రిష్ణారెడ్డి పంచాయరాజ్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పద్మావతి, ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నేత మృతి



శివప్రసాద్ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు సచివాలయం–2 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనరు, కృష్ణంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే శివప్రసాద్ (40) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. రాడ్‌బెండర్ పని చేసుకుంటూ జీవనం సాగించే శివప్రసాద్ బుధవారం తనకు ఛాతిలో నొప్పివస్తోందని కుటుంబ సభ్యులతో చెప్పాడు. వెంటనే వారు ఆయన్ను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. శివప్రసాద్ కందుకూరు సచివాలయం–2 (కృష్ణంరెడ్డిపల్లి, జంగాలపల్లి) కన్వీనరుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో కీలకంగా పని చేసేవాడని స్థానిక నాయకులు తెలిపారు. సమాచారం అందుకున్న జేసీఎస్ మండల కన్వీనర్ జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శారదాకొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హోతూరు సుధీర్‌రెడ్డి, రామలింగారెడ్డి, లింగమయ్య, రాగే పెద్దప్ప, ధర్మవరం వెంకటరామిరెడ్డి, హరికృష్ణ, చిరంజీవి తదతరులు శివప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సంతాపం

శివప్రసాద్ మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీలో చురుకుగా ఉంటున్న శివప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మైనారిటీల మది దోచిన జగన్

- ఇప్పుడు హజ్ యాత్రనూ రాజకీయం చేయడం టీడీపీకి తగదు



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం సిటీ: ముస్లిం మైనార్టీల మనసు దోచిన ముఖ్యమంత్రుల్లో వైఎస్సార్ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా, ముఫ్తి ముదసిర్, ముఫ్తి మహమ్మద్ తల్హా, జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, కార్పొరేటర్ రహంతుల్లా, అబూసలేహా, గఫార్, కోఉపూరునగర్ ఖాజా, కన్వీనర్ ఇమ్రాన్ తదితరులతో కలసి ఆయన విలేకర్లతో బుధవారం మాట్లాడారు. బీజేపీతో అంటకాగిన టీడీపీ తన హయాంలో విజయవాడకు ఎంబార్కేషన్ పాయింట్ తీసుకురావడంలో వైఫల్యం చెందారని మండిపడ్డారు. అటువంటి నేతలు ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై రాజకీయంగా బురద జల్లేందుకు ప్రయత్నించడం క్షమించరానిదన్నారు. మన రాష్ట్రం నుంచి 1,813 మంది మైనారిటీలు ఈసారి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు బయలుదేరడంతో ఒక్కొక్కరిపై రూ.83 వేలు అదనపు భారం పడిందన్నారు. హైదరాబాద్, బెంగళూరు నుంచి అయితే ఈ భారం పడేది కాదని పేర్కొన్నారు. అయితే విజయవాడ కేంద్రం నుంచి బయలుదేరిన హజ్ యాత్రికుల విషయం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గౌసుల్ ఆజాం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అంజద్‌బాషా, ఆజాంతో పాటు ఎంపీ మిథున్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులను ఢిల్లీకి పంపి దేశీయ విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, దేశీయ మైనారిటీ మంత్రి స్మృతి ఇరానీతో మాట్లాడించారన్నారు. ఆ తరువాత సీఎం జగన్ చొరవ చూపి వెంటనే హజ్ యాత్రికులపై పడిన రూ.14.51 కోట్ల ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ ఆ నిధులను విడుదల చేయడం ముస్లిం మైనారిటీలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. ముస్లిం మైనారిటీలందరూ వైఎస్ జగన్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు.

టూరిస్ట్ బస్ ఓనర్ల సంఘం అధ్యక్షుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

రాప్తాడు రూరల్: టూరిస్ట్ బస్ ఓనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లంశెట్టి శ్రీనివాసులు (58) గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసులుకు భార్య మల్లేశ్వరి, కూతురు, కుమారుడు ఉన్నారు. శ్రీనివాసులు మృతి పట్ల టూరిస్ట్ బస్సుల యజమానులు సోమశేఖర్‌గౌడ్, జి.నాగరాజు, మోహన్‌గౌడ్ రవీంద్ర, జి.ప్రసాద్, రామచంద్రారెడ్డి, ఎం.రామాంజనేయులు, వి.మురళి తదితరులు సంతాపం తెలియజేశారు. సమాచారం తెలియగానే శ్రీనివాసులు మృతదేహానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాళులర్పించారు.

ఆరోగ్య కార్యదర్శి మృతికి నివాళి

అనంతపురం క్రైం: నగరంలోని 38వ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి షరీఫా (35) అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం బుధవారం మంగళవారి కాలనీలోని మృతురాలి నివాసానికి వెళ్లారు. షరీఫా మృతదేహానికి నివాళులర్పించారు.

వాహనాల తనిఖీ

రాప్తాడురూరల్/ఆత్మకూరు: ఎస్పీ ఆదేశాలతో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న విజువల్ పోలీసింగ్‌లో బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డు నరిగమ్మ ఆలయం వద్ద, ఆత్మకూరులోను పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పలువురు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రజలతో గౌరవంగా మాట్లాడాలి



అర్జీలు స్వీకరిస్తున్న సీఐ విజయభాస్కర్‌గౌడ్

రాప్తాడురూరల్: వివిధ సమస్యలు, ఇబ్బందులపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కర్‌గౌడ్ సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం సీఐ స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రంలోని కూర్చుని వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అర్జీలు స్వీకరించారు. అనేక ఇబ్బందులతో స్టేషన్ మెట్లు ఎక్కేవారి సమస్యలను సావధానంగా తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు.

శ్రీశ్రీ నగర్‌లో నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

అనంతపురం క్రైం: నగరంలోని 49వ డివిజన్ ఎక్స్‌టెన్షన్ గంగానగర్ సమీపంలో ఉన్న శ్రీశ్రీనగర్‌లో నిర్వాసితులకు గురువారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

హిజ్రాలతో గొడవ



హిజ్రాల దాడిలో గాయపడిన గుణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం అర్ధరాత్రి రాణీనగర్‌కు చెందిన గుణ అనే వ్యక్తి మద్యం మత్తులో హిజ్రాలతో గొడవపడ్డాడు. నోట్లో బ్లేడు పెట్టుకుని బెదిరిస్తూ.. పచ్చి బూతులు తిడుతూ దాడికి యత్నించాడని హిజ్రాలు తెలిపారు. ఈ క్రమంలో తాము కూడా ఎదురుదాడి చేయడంతో గుణ స్పృహ తప్పి పడిపోయాడన్నారు. ఆ వ్యక్తి వద్ద గంజాయి లభించిందని ఆరోపించారు. బద్రీ అనే వ్యక్తి ప్రోద్బలంతో తమపై దాడిచేసిన గుణపై చర్యలు తీసుకోవాలంటూ హిజ్రాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఉదయం స్టేషన్‌కు రావాలని చెప్పి వారిని పోలీసులు పంపించేశారు. దాడిలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా సంత్ సూరదాస్ జయంతి



సంత్‌సూరదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల తెలుగు, హిందీ భాషా విభాగాల ఆధ్వర్యంలో బుధవారం సంత్ సూరదాస్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకరరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆర్ట్సు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంక మౌళి మాట్లాడుతూ సూరదాస సగుణ సంప్రదాయవాది అన్నారు. గొప్ప భక్తకవి అని, కృష్ణ తత్వభక్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. సంగీత విద్వాంసుడని కొనియాడారు. వికలత్వం అనేది శరీరానికే గానీ మనసుకు కాదనేది సూరదాస్ నిరూపించారన్నారు. కార్యక్రమంలో సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంచాలక్ జిల్లా అధ్యక్షులు హినకర్, సక్షమ్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ భానుకిరణ్, కళాశాలసెక్రెటరీ డాక్టర్ కె.నిర్మలమ్మ, కళాశాల ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి, సభ్యులు ఎర్రిస్వామి, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ నగరూరు రసూల్, డాక్టర్ ఓబిరెడ్డి, ఫిరోజా, హిందీ విభాగాధిపతి రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



చెన్నేకొత్తపల్లి: మండలంలోని యర్రజిన్నన్నగారిపల్లి (కొండకిందపల్లి) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయం వేదపండితులు ప్రత్యేక పూజలు , హోమాలు చేశారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు.

ముత్యాలమ్మ గ్రామోత్సవం



ముత్యాలమ్మ, దుర్గమ్మలను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రంలో బుధవారం నసనకోట ముత్యాలమ్మ, దుర్గమ్మ జాతరను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఏడాది గ్రామ ప్రజలు రామగిరి మండలం నసనకోట ముత్యాలమ్మ, దుర్గమ్మ దేవతలను గ్రామానికి తీసుకొనివచ్చి రెండు రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విగ్రహాలు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతులు, బోనాల మహోత్సవం తెల్లవారుజామున జరిగింది.

బంగారు చోరీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగరంలోని రాజన్న కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. నాలుగు తులాల బంగారం చోరీ అయింది. ఈ మేరకు బాధితులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఇంటికి తాళం వేసి.. తాళం చెవి బాత్రూంలో పెట్టి వెళ్లానని యజమాని తెలిపాడు. తర్వాత దుండగులు తాళం తెరిచి లోనికి ప్రవేశించి.. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

Before the Hon'ble Senior Civil Judge at Chikkaballapur in the matter of ;

Original Sult Number : 239/2019

Plaintiff : G.S. Nagaraju Son of G. Srinivasulu, Aged about 43 years, Advocate & Agriculturist, Resident of 9th ward, BGS School Road, Near Seven Hills School, Bagepalli Town & Taluk, Chikkaballapur District.

Versus

Defendant-10 : J. Satyaprasad Son of J. Lakshmi Narayana, Aged about 52 years, Business, R/at Kamala Nagar, Behind the Lay-out of ICICI Bank, Ananthapuramu Town, Ananthapuramu District, AP State.

Whereas the plaintiff by name G.S. Nagaraj has instituted suit in O.S. No. 239/2019 against you namely defendant-10 with respect to schedule property stated below. You i.e. defendant-10 is here by summoned to appear in this court in person or by a pleader duly instructed, and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions on the **16th day of June 2023 at 11 "O" clock** in the noon, to answer the claim, and as the day fixed, for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witness upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defence.

Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

Give under my hand and the seal of the court, this day of **20th of April 2023.**

SCHEDULE PROPERTY

1. The land having old survey number : 512 and new survey number : 512/4 measuring 0.20 guntas inclusive of Schedule 'B' Property mentioned hereunder situate at Bagepalli Village, Kasaba Hobli Bagepalli Taluk, bounded on : East by : Survey No. 511; West by : Survey No. 512/1, 3 & 5; North by : Survey No. 512/6 & 512/5; South by : Survey No. 510

// By order of the Court //

Place: Chikkaballapur, **Date :** 15-04-2023

G.S. Nagaraj Advocate, Bagepalli, Karnataka	Sherestedar Court of Civil Judgge & J.M.F.C., Bagepalli